# అక్షరయోగి
# ఆచార్య ఆత్రేయ

వ్యాస సంకలనం



సంపాదకులు

**డా. తండు కృష్ణ కౌండిన్య**

# అక్షర యోగి ఆచార్య ఆత్రేయ

# AKSHARA YOGI ACHARYA ATREYA

సంపాదకులు : డా. తండు కృష్ణ కౌండిన్య

EDITOR : DR. THANDU KRISHNA KOUNDINYA

978-93-5737-054-7

ISBN : 978-93-5737-054-7

ప్రథమ ముద్రణ: సెప్టెంబరు 2022

ప్రతులు: 500

వెల: 150

ముఖ చిత్రం : పామర్తి శంకర్, ప్రముఖ కార్టూనిస్టు

© వందనా పబ్లికేషన్స్, నల్లగొండ

ప్రతులకు : మాదగాని శంకరయ్య
నల్లగొండ, 8919848969
మరియు అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

ముద్రణ: లేపాక్షి ప్రింటర్స్, హైదరాబాద్

# విషయ సూచిక


1. సినీ వేమన-అచార్య ఆత్రేయ- డా. సుద్దాల అశోక్ తేజ 1-4
2. ఆత్రేయ కడపటి కోరిక- డా. పైడిపాల 5-8
3. ఆశుకవి- అచార్య ఆత్రేయ- జె.కె భారవి 9-12
4. యుద్ధంపై యుద్ధం-సమ్రాట్ అశోక- నంది వెలుగు ముక్తేశ్వర రావు 13-17
5. ఈనాడు నాటక రచనా వైశిష్ట్యం-డా. బాణాల భుజంగ రెడ్డి 18-29
6. వాస్తవం నాటకం -పరామర్శ -డా. బెల్లి యాదయ్య 30-32
7. అక్షరాలను లాలించే ఆత్రేయ గీతాలు- కన్నూరి అలెగ్జాండర్ 33-35
8. ఆత్రేయ సినిమా పాటలలో చమత్కార విశేషాలు- డా.యం. పురుషోత్తమాచార్య 36-42
9. విలువ వెతికిన ఆత్రేయ ఒక్క రూపాయి-వేముల ఎల్లయ్య 43-47
10. మనసును శోధించిన ఆత్రేయ మానవీయ గీతాలు -అంబటి వెంకన్న 48-56
11. సమకాలీన జన జీవన స్పష్టీకరణ -చస్తే ఏం?- డా. యల్. లేఖానంద స్వామి 57-62
12. పరివర్తన నాటకం-ఒక పరిశీలన- పెరుమాళ్ళ ఆనంద్ 63-67
13. గౌతమబుద్ధ నాటకానుశీలనం - డా. మండల స్వామి 68-73
14. ఆత్రేయ సామాజిక స్వప్నం- విశ్వశాంతి నాటకం -డా. కె. కరుణశ్రీ 74-81
15. మానసిక కవితావైద్యుడు- ఆత్రేయ-డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి 82-84
16. ఎన్.జి.ఓ. నాటకం -పాత్రల చిత్రీకరణ- డా. యన్. దీపిక 85-89
17. మనసుకవి ఆత్రేయ-పున్నమి 90-92
18. ఆత్రేయ సినిమా సంభాషణలు-డా. తలతోటి పృథ్వీరాజ్ 93-102
19. మధ్యతరగతి జీవితాల ప్రతిబింబం- ఎన్.జి.ఓ నాటకం -నర్రా లవేందర్ రెడ్డి 103-106
20. అడుగంటిన ఆశయాలకు మాటలు నేర్పిన ఆత్రేయ- డా.పివి సుబ్బారావు 107-112
21. మనసూ-వయసు నాటకం మనోవిశ్లేషణ-ఉప్పల పద్మ 113-116
22. తెరచిన కళ్ళు-సందేశాత్మకత -బాసరాజు యాదగిరి 117-118
23. ఆత్రేయ సినీగీతాల్లో సామాజిక స్పృహ-కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి 119-121
24. అంత్యార్పణం-నాటికానుశీలనం-కనకటి రామకృష్ణ 122-125
25. ఆత్రేయ గీతాలలో తాత్వికత - డా. వి.వి. సుబ్బారావు 126-129
26. భయం నాటకానుశీలనం -సాగర్ల సత్తయ్య 138-134
27. ఆకలిని కథానాయకుడిని చేసిన ఎవరుదొంగ నాటిక- శీలం భద్రయ్య 135-143
28. నా జీవిత చుక్కాని, ఆత్రేయ పాట-ధీకొండ వెంకటేశ్వర్లు 144-145
29. కప్పలు నాటక విశ్లేషణ- డా. కోయి కోటేశ్వరరావు 146-152
30. ఆత్రేయ సినీగేయ సాహిత్యం-సామాజిక దృక్పథం -డా. పొరెడ్డి రంగయ్య 153-157
31. ఆత్రేయ ఆత్మకథ-రసాత్మక కావ్యం-డా. తండు కృష్ణ కౌండిన్య 158-167
32. అంతర్యుద్ధం- నాటిక పరిశీలన-మాదగాని శంకరయ్య 168-171


---0----

# 14. ఆత్రేయ సామాజిక స్వప్నం -విశ్వశాంతి నాటకం

-డా. కె. కరుణశ్రీ, తెలుగు సహాయాచార్యులు
డి.కె. ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.), నెల్లూరు, 9441640317

ఏ నాటకంలోనైనా కొన్ని సంఘటనలుంటాయి. ఆ సంఘటనల్ని నడిపించడానికి అవసరమైన పాత్రలుంటాయి. ఆ పాత్రల చుట్టూ అల్లుకున్న సంభాషణలూ ఉంటాయి. ఈ మూడింటిని రచయిత ఎంత నేర్పుగా ఎంత శక్తివంతంగా చిత్రిస్తే అది అంత గొప్ప నాటకమౌతుంది. ఏ నాటకమైనా రచయిత రచించిన 50 సంవత్సరాల తర్వాత కూడా ఆ నాటక అవసరం ఈ సమాజంలో ఇంకా ఉందంటే ఆ నాటక రచయిత గొప్ప ద్రష్ట, స్రష్ట అయి ఉండాలి. విశ్వశాంతి నాటకం ఆత్రేయ 1951లో రచించిన నాటకం. అప్పట్లో జనవాణి పత్రికలో సీరియల్‌గా ప్రచురితమైంది. ఈ నాటకంలో సన్నివేశాలు కానీ, అందులో ఆయా పాత్రలు మాట్లాడిన మాటలు కానీ ఇప్పటికీ నిత్యనూతనంగా కనిపిస్తున్నాయంటే కవి ఎంచుకున్న ఇతివృత్తానికి మాత్రమే ప్రాసంగికత ఉంటే సరిపోదు. సంభాషణలకు కూడా అంతటి ప్రాసంగికత ఉండాలి అన్న విషయం ఆత్రేయ నాటకాలను చూస్తే మనకు బాగా అర్థమౌతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే విశ్వశాంతి అనేది ఆత్రేయ రాసిన నాటకం మాత్రమే కాదు. ఆత్రేయ ఆశించిన సమాజం కూడా. అందుకే ఈ నాటకంలో ఉన్నవి పాత్రల్లాగా, అందులో ఉన్నది కథ లాగా అనిపించదు. మన చుట్టూ ఉన్న సమాజం, అందులోని వ్యక్తులే ఈ నాటకంలో కనిపిస్తారు. ఏలూరులో ఆంధ్రరాష్ట్ర శాంతి కమిటీ వారిచే జరపబడిన సాంస్కృతిక మహాసభల్లో ఆంధ్ర ఆర్ట్స థియేటరు - విజయవాడ వారిచే 31-8-52న ప్రదర్శింపబడి ప్రదర్శనలోను, రచనలోను ప్రథమ బహుమతినిపొందిన నాటకం ఇది. ఈ రకమైనటువంటి నీతి, సందేశ ప్రధానమైనటువంటి నాటకాలను ఇంగ్లీషులో Morality Plays అంటారని, నాటకరంగమనే వైద్యశాలలో జరుగుతున్న ఒక చికిత్స విధానమే ఈ విశ్వశాంతి నాటకమని, ఈ నాటకానికి రాసినటువంటి ముందుమాటలో శ్రీశ్రీ అన్నారు.

విశ్వశాంతి అనే నాటకం ఒక విచిత్రమైన నాటకం. ఈ నాటకంలో ఉండేటటువంటివి పాత్రలు కావు. ఈ లోకంలో ఉన్న ఎన్నో పాత్రలకు సంకేతాలు. నాటకమంతా ఒక నీతి, ఒక సందేశం ప్రవహిస్తూ ఉంటుంది. మనుషులున్నంత కాలం ప్రపంచమంతా యుద్ధమనేప్రధానమైన సమస్య ఉంటుంది. అటువంటి యుద్ధమే ఈ నాటకంలోని ఇతివృత్తం. ఏదైనా సరే ఒక ఉపదేశాన్ని చేయడమనేది కత్తి మీద సాము. ఎందుకంటే ఏ పాత్ర అయినా నీతులు చెప్తుంటే ఉపన్యాసాలిస్తుంటే ఎవరూ వినరు.

ఒక పాత్ర చేత కవి పలికించే మాటలు ప్రేక్షకుల మనసును హత్తుకోవాలి. అందులో ఇలాంటి సందేశపూర్వకమైన నాటకాల్లో అది ఇంకా చాలా కష్టం. అందుకు తగ్గ సన్నివేశాల్ని సృష్టించి ఆ పాత్రల మీద సహృదయుడికి సానుభూతి ఉండేలా చేయాలి. అదొక ఇంద్రజాలం. ఆ ఇంద్రజాలాన్ని ఆత్రేయ అద్భుతంగా పోషించారని ఈ నాటకానికి రాసిన ముందుమాటలో శ్రీశ్రీ అనడం చాలా సముచితం. విశ్వశాంతి నాటకం ఐదు రంగాల్లో ఉన్న నాటకం. నాటకం ప్రదర్శించేటప్పుడు ఎక్కడ ఏవేవి ఉండాలో చెప్పడం, తెర ఎలా తీయాలో, ఎలా వేయాలో కూడా చెప్పడం, ప్రదర్శన యోగ్యమైన సలహాలు ఇవ్వడం నాటకాలకు చాలా అవసరం. ఆత్రేయ నాటక ప్రదర్శన విషయంలో కూడా అడుగడుగునా అనేక సలహాలు ఇస్తూ వచ్చారు. ఈ నాటక ప్రత్యేకతంతా ఎక్కడ ఉందంటే ఈ నాటకంలోని ఇతివృత్తం ప్రదర్శన యోగ్యంకానిది. యుద్ధాన్ని, యుద్ధ పరిణామాల్ని, శాంతి ఆవశ్యకతను రంగస్థలం మీద ప్రదర్శనా యోగ్యంగా మలచిన నాటకం విశ్వశాంతి నాటకం. ప్రాచీన నాటక లక్షణాలలో నాంది, ప్రస్తావన అనేవి తప్పకుండా ఉంటాయి. నాందీ శ్లోకం నాటకంలో ఉన్న కథను సూచన ప్రాయంగా సూచిస్తుంది. నాటక ప్రారంభంలో తెర వెనుక నుంచి వినిపించే “ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం నర జాతి చరిత్ర సమస్తం పరపీడనపరాయణత్వం” అన్నశ్రీశ్రీ గేయం జరగబోయే ఈ నాటక కథను మొత్తం వాచ్యంగా సూచిస్తుంది. ఈ నాటకంలో భూదేవి పాత్ర ద్వారా ఆత్రేయ యుద్ధం గురించి చెప్పిన మాటలు నిత్యసత్యాలు. కాలాన్ని బట్టి యుద్ధం మారింది, స్వభావం మారింది, కానీ మానవ మనస్తత్వం మాత్రం మారలేదు.యుద్ధకాంక్ష మాత్రం మానవుడిలో పోలేదు. అందుకే ఆత్రేయ ఈ నాటకాన్ని “యుద్ధం కావాలి అనే మనుషులకు అంకితమిచ్చారు.” ఆ... యుద్ధమే కదా యుద్ధాల గురించి మనం ఎంత చదవలేదు. యుద్ధం గురించి మనకు తెలియంది ఏముంది అని అనిపిస్తుంది కానీ నాటక ప్రారంభం నుంచి చివరి వరకు రంగస్థలం మీద యుద్ధాన్ని చూపించకుండానే ఒక భయంకరమైనయుద్ధాన్ని పరిచయం చేశారు ఆత్రేయ.

ఆత్రేయ చిన్న మేనమామ జగన్నాథాచార్యులు గొప్ప అభ్యుదయ భావాలు కలిగినటువంటి వారు. నాటకాలు స్వయంగా రాసి వేసేవారు. ఆయన దగ్గర ఆత్రేయ పెరగడంవల్ల ఆత్రేయ నాటకాలన్నింటిలోనూ కూడా ఈ అభ్యుదయ భావాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఒక కుటుంబాన్ని ప్రతీకగా తీసుకొని మొత్తం ప్రపంచాన్ని అందులో చూపించిన నాటకం ఇది. కవిత్వంలో ప్రతీకలు కనిపించడం సాధారణం కానీ నాటకంలో ప్రతీకలు కనిపించడం అరుదు. అటువంటి అరుదైన ప్రతీకలు విశ్వశాంతి నాటకంలో కనిపిస్తాయి.ఈ నాటకంలో ఉన్న పాత్రలన్నీ అనేక భావాలకు సంకేతాలు. మాతృమూర్తి

భూదేవి భూమాతకు సంకేతం. భూదేవి కన్నబిడ్డలే చిన్నోడు, పెద్దోడు. పెద్దోడు సామ్రాజ్యవాదులకు ప్రతినిధి. దోపిడీలకు,దురహంకారాలకు వారసుడు. చిన్నోడు లోకంలో కనిపిస్తున్న అమానుష హింసా పీడనకు తట్టుకోలేక తిరగబడుతున్న విప్లవానికి ప్రతిబింబం. కుమార్తె సమత చిన్నకొడుకు పోరాడుతున్నటువంటి సమతా మమతలకు ప్రతీక. ఈ అమ్మాయికి పేరు పెద్దోడు సామ్రాజ్యమని, చిన్నోడు సమతని పెట్టారు. అమరయ్య పేరులాగానే అమరుడు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నాడు. ఒక కాలు, ఒక కన్ను, ఒక చేయి పోయినా ఇంకా బతికే ఉన్నాడు. యుద్ధం గురించి యుద్ధ వినాశనాన్ని గురించి కళ్ళకు కట్టినట్టు చెప్పగల నేర్పరి. సమతకు, ఊర్లో జనానికి అందరికీ కూడా యుద్ధం వలన కలగబోయే అనర్థాన్ని పరిచయం చేసిన వ్యక్తి అమరయ్య. సైంటిస్ట్ విజ్ఞానాన్ని మానవ వినాశనానికి ఉపయోగించే వ్యక్తి కానీ చివర్లో మారిపోయినటువంటి వ్యక్తిగా కనిపిస్తారు. సుబ్బయ్య పెద్దోడి దగ్గర పనిచేసే ఒక బంట్రోతు.

**ఇతివృత్తం:-** భూదేవి ఇంట్లో నాటకం ప్రారంభమౌతుంది. తెర ఎత్తక పూర్వమే ఒక గంభీర కంఠం శ్రీశ్రీ గేయం "ఏ దేశచరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం" అంటూ ఆలపిస్తుంది. మొదటి రంగంలో తెరమీదకు వచ్చిన అమ్మాయి రావడం రావడమే 'యుద్ధం! యుద్ధం! తాడు తెగిన యుద్ధం' అంటూ నానా తిట్లు తిడుతూ సగం కోపం సగం బాధతో ప్రవేశిస్తుంది. ఈ అమ్మాయిని పెద్దోడు సామ్రాజ్యం అని పిలిచినా ఆ అమ్మాయికి మాత్రం చిన్నన్నయ్య పిలిచేటటువంటి సమత అనే పేరుతోనే వినిపించుకోవడం ఇష్టం. పెద్దన్నయ్య తప్ప ఈ అమ్మాయిని అందరూ సమత అనే పిలుస్తారు. ఈ అమ్మాయి ఏడుస్తూ యుద్ధం గురించి మాట్లాడుతూ రంగస్థలం మీదికి రాగానే ఆ అమ్మాయి తల్లి భూదేవి యుద్ధం గురించి నీకెందుకు స్కూల్‌కు వెళ్ళవుగాని రా! అంటూ ఓదారుస్తూ వస్తుంది. దానికి ఆ అమ్మాయి ఈరోజు స్కూల్లో యుద్ధం గురించి కాంపోజిషన్ రాసుకొని రమ్మన్నారు రాయకుండా నేను వెళ్ళను అంటుంది. దాంతో తల్లి భూదేవి యుద్ధాన్ని గురించి ఇంతవరకు ఎవ్వరూ నిజం రాయలేదు. అంటూ యుద్ధం గురించి చెప్తూ వెక్కివెక్కి ఏడుస్తుంది. అంతలో అక్కడికి అమరయ్య వస్తాడు. సమతకు యుద్ధం అంటే ఏంటో రకరకాల ఉదాహరణల ద్వారా చెప్పడానికి ప్రయత్నిస్తాడు. ఇది నా కాలు, ఇది నా చేయి, ఇది నా కన్ను అంటూ ఒక్కొక్కటిగా తన అవయవాలను తీసి పక్కన పెడతాడు. దాంతో నాటకం చూస్తున్న ప్రేక్షకులకు కూడా యుద్ధం అంటే ఏంటో అర్థమైపోతుంది. ఇంతలో అక్కడికి సమత ఇద్దరు అన్నయ్యలూ వస్తారు. ఇద్దరికీ పడదు. ఇద్దరివీ భిన్న మనస్తత్వాలు. ఇద్దరూ రంగస్థలం

సీదకు ప్రవేశించిన ప్రతి సారీ ఏదో ఒక గొడవ పడుతూ ఉంటారు. అదే సమయంలో భిక్ష కోసం అంతా మాయేనంటూ ఒక స్వామీజీ కూడా వస్తాడు. ఈ నాటకంలో చిన్నోడు చెప్పినట్టు వీరిద్దరి మధ్య ఘర్షణ ఎప్పటికీ తీరదు. ఎందుకంటే వీరిరువురి ఘర్షణ ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ కాదు రెండు సిద్ధాంతాల మధ్య సంఘర్షణ. తల్లి మాత్రం చిన్న కొడుకునే సమర్థిస్తూ ఉంటుంది. అదే సమయంలో శాస్త్రి అనే ఒక సైంటిస్ట్ పెద్దోడిని కలవడానికి వస్తాడు. ఇతడు తన పరిశోధనల గురించి ఎవరికీ నిజం చెప్పడు. పెద్దోడితో రహస్యంగా మంతనాలు చేస్తుంటాడు. పెద్దోడు, సైంటిస్ట్ కలిసి ఒక ఫ్యాక్టరీ నిర్మిస్తుంటారు. పెట్టుబడి పెద్దోడిది. పరిశోధనలు శాస్త్రివి. వారిద్దరూ పెడుతున్నది పింగాణీ ఫాక్టరీ అని దానికి ఊరివాళ్ల భూములు కావాలి అని పెద్దోడు చెప్తాడు. ఏ భూముల్లో అయితే ఫాక్టరీ కట్టాలని అనుకుంటున్నారో అదే భూముల్లో రిజర్వాయర్ కట్టాలని ఆ ఊరి రైతులు చాలా కాలంగా తీర్మానించుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపి ఉంటారు. రిజర్వాయర్ కట్టడానికి ఇక్కడ తప్ప వేరే స్థలం లేదు. ఇంతలో అక్కడికి ఆ ఊరి మాస్టారు రిజర్వాయర్ కట్టడానికి ప్లాన్ కూడా తీసుకొస్తాడు. వీరందరినీ చిన్నోడు వ్యతిరేకిస్తూ ఉంటాడు. శాస్త్రి కూతురు శాంతి మాత్రం చాలా మంచిది. చిన్నోడి స్నేహితురాలు. ప్రపంచమంతా శాంతి రావాలని మాట్లాడుతూ ఉంటుంది. ఇక ఈ మొదటి రంగం చివర్లో పెద్దోడు భూముల్ని లాక్కోడానికి పంటలను పాడుచేయడం, తిండిగింజల రేట్లు పెంచి అందరి దగ్గరా ఉన్నవి కొని స్టాకు పెట్టడం లాంటి పనులన్నీ చేస్తాడు. దాంతో ఊర్లోకరువు కాటకాలు మొదలౌతాయి. ప్రకృతి కూడా పెద్దోడికి అనుకూలిస్తుంది. దాంతో ప్రథమ రంగం అయిపోతుంది. రెండవ రంగం ప్రారంభమౌతుంది.

రెండో రంగంలో ఎక్కడ చూసినా కరువు తాండవిస్తూ ఉంటుంది. ఊర్లోమనుషులకు, పశువులకు ఇద్దరికీ తిండి లేదు. ఎంత కరువంటే ఇంటి పైకప్పు పీకి పశువులకు వేస్తాడు అమరయ్య. ఆ కరువు భరించలేక ఊరి వాళ్ళందరూ ఆ ఊరు వదిలి వెళ్ళిపోతుంటే పెద్దోడు ఆపి పొలాలు ఇస్తే ఫ్యాక్టరీ కట్టి పనిస్తానని చెప్పి పొలాలన్నీ తీసుకొని ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభిస్తాడు. దాంతో రెండో రంగం పూర్తవుతుంది.

సమతకు సుస్తీ చేసి మంచంలో పడుకుని ఉండడంతో మూడవ రంగం ప్రారంభమవుతుంది. సమత సుస్తీ అనడం తోనే ఆ ఊర్లో ఇప్పుడు పెద్దోడి రాజ్యం సాగుతుందని కవి మనకి ప్రతీకగా తెలియజేస్తాడు. మంచంలో పడుకొని సమత శాంతి కోసం కలవరిస్తూ ఉంటుంది. ఈ మూడవ రంగంలో జనం ఫ్యాక్టరీలో వచ్చే డబ్బులు సరిపోక సగం ఆకలితో ఉంటారు. చాకిరీకి బాగా అలవాటు పడిపోయి ఉంటారు. ఇంతలో అమరయ్య వచ్చి శాంతికి, వాళ్ళ నాన్న శాస్త్రికి గొడవ జరిగింది, శాస్త్రి శాంతనుమనింటికి

వెళ్ళొద్దని చెప్పాడు కాబట్టి శాంతి ఇక్కడకు రాదు అని సమతతో చెప్తాడు. చిన్నోడు ఒక శాంతి పత్రం తయారు చేసి దాని మీద సంతకాలు చేయమని అందరినీ అడుగుతుంటాడు. కానీ శాంతి పత్రం మీద సంతకం చేసిన వాళ్లని పెద్దోడు ఉద్యోగంలో నుంచి తీసేస్తూ ఉంటాడు. వీరాయ్ అనే కార్మికుడు అటువంటివాడు. నేను తెలియక శాంతి పత్రం మీద సంతకం చేశాను. నన్ను పెద్దోడు పనిలోంచి తీసేశాడు. నాకు శాంతి అక్కర్లేదు, ఏమీ అక్కర్లేదు. నా పెళ్ళాం బిడ్డలు ఇంత తిండి తిని బ్రతికి ఉంటే చాలు అని అంటుంటాడు. ఆకలితో అల్లాడుతూ ఉన్న వీరయ్యకు భూదేవి అన్నం పెట్టాలి అనుకుంటుంది. ఇంతలో అక్కడికి శాంతి పెద్దోడు ఇద్దరూ వస్తారు. ఫ్యాక్టరీలో బాంబులు తయారు చేస్తున్నారు అన్న విషయం శాంతి తెలుసుకుంటుంది. దాంతో శాంతి దగ్గర ఉన్న పావురాన్ని పెద్దోడు చంపాలనుకుంటాడు. కానీ చిన్నోడు విశ్వం దానిని కాపాడడంతో మూడవ రంగం ముగుస్తుంది.

ఇక నాలుగవ రంగం నాటకంలో ప్రదర్శిస్తున్న మరో నాటకం. యుద్ధం అంటూ వస్తే దాని పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో జనాలకు చూపించాలని చిన్నోడు విశ్వం, శాంతి కలిసి ప్రదర్శించిన నాటకం ఇది. యుద్ధం వల్ల నేరుగా దెబ్బతిన్న అన్ని దేశాల్లోనూ జర్మనీ, జపాన్, ఇంగ్లాండ్, ఇటలీలో ఇలాంటి కథలు జరిగాయంటూ ఆ కథను ప్రదర్శిస్తారు. బేబీ, జాన్ అనే ఒక జంట కథ ఇది. జాన్, బేబీ ప్రేమించుకుంటారు. పెళ్లి, ఆ తర్వాత అందమైన జీవితం గురించి ఎన్నో కలలు కంటారు. కానీ రేపు పెళ్లి అనగా యుద్ధం మొదలౌతుంది. జాన్ సైనికుడు కాబట్టి బలవంతంగా యుద్ధానికి వెళ్ళాల్సి వస్తుంది. జాన్, బేబీలు విడిపోయే ముందు ఉంగరాలు మార్చుకుంటారు. యుద్ధంవలన ఆహారోత్పత్తి తగ్గిపోయింది. ఎన్నో ఊళ్ల జనాలు తిండి లేక చనిపోతారు. అందులో బేబీ కుటుంబం కూడా ఉంటుంది. తన తండ్రిని పోగొట్టుకున్న బేబీ ఆకలికి తట్టుకోలేక చివరికి తన శీలాన్ని కూడా అమ్ముకుంటుంది. ఇక అక్కడ జాన్ ఆ యుద్ధం చేయలేక బేబీని మర్చిపోలేక స్నేహితుడి ప్రోద్భలంతో తాగుడికి బానిస అవుతాడు. స్త్రీ అంటే గౌరవం కల మనిషి డబ్బుపోసి స్త్రీని కొనుక్కునే స్థితికి దిగజారిపోతాడు. అలాంటి సమయంలో ఒకసారి జాన్ బేబీలు ఎదురుపడతారు. ఆ స్థితిలో బేబీని చూసి జాన్ అసహ్యించుకుంటాడు. ఆనాటి నుంచి పిచ్చివాడిలా జాన్ తిరుగుతూ ఉంటాడు.

ఆ పరిస్థితుల్లో మరో యుద్ధానికి బీజం వేసి జరుగుతున్న యుద్ధం ఆగిపోతుంది. హిరోషిమాలో అటంబాంబు పడుతుంది. యుద్ధంలేకపోవడంతో జాన్‌ని ఇంటికి పంపించేస్తారు. నిరుద్యోగసమస్య మొదలౌతుంది. పిచ్చివాడిలా తిరుగుతూ ఉద్యోగం

క్రోసం వెతుక్కుంటూ ఉంటాడు. ఆ సమయంలో టీ తాగడానికి ఒకటి షాప్‌కి వెళ్తాడు. టీ తాగిన తర్వాత డబ్బులు లేకపోవడంతో టీ అమ్మే ఆవిడతో గొడవపడి ఆవిడ గొంతు పిసుకుతూ చివరినిమిషంలో ఆవిడ బేబి అని గుర్తిస్తాడు. కానీ అప్పటికే ఆలస్యమైపోతుంది. ప్రాణాలు పోతున్న దశలో బేబీ కూడా జాన్‌ను గుర్తిస్తుంది. తర్వాత ఇదంతా భరించలేక జాన్ కూడా ఆత్మహత్య చేసుకుంటాడు. నాటకం ముగుస్తుంది. అంతలో సుబ్బయ్య వచ్చి ఫ్యాక్టరీలో బాంబులు తయారు చేస్తున్నారు. వాటాల విషయంలో పెద్దోడు, శాస్త్రి గొడవ పడుతున్నారు. ఇదంతా నేను విన్నాను రండి రండి... అనడంతో అందరూ ఫ్యాక్టరీ దగ్గరికి పరుగులు తీస్తారు.

ఐదవ రంగం ఫ్యాక్టరీలో ప్రారంభమౌతుంది. శాస్త్రి, పెద్దోడు ఇద్దరూ వాటాల దగ్గర గొడవ పడుతుంటారు. ఇద్దరూ నేను గొప్పంటే నేను గొప్పని వాదులాడుకుంటుంటారు. చివరికి శాంతి మాటలతో శాస్త్రిలో పరివర్తన వచ్చి పెద్దోడికి వ్యతిరేకంగా మాట్లాడుతాడు. అప్పటికీ పెద్దోడు మారకపోవడంతో చివరికి భూదేవి తుపాకి తీసుకుని పెద్దోడిని ఆపడానికి ప్రయత్నిస్తుంది. ఆ ప్రయత్నంలో అక్కడ నిప్పు అంటుకుంటుంది. అందరూ బయటపడతారు కాని శాస్త్రి, పెద్దోడు మాత్రం చనిపోతారు. ఇంతలో అక్కడికి సమతను కూడా తీసుకొస్తారు. సమత లేచి కూర్చొని శాంతి కావాలని అందరూ అరవండి అంటుంది. అందరూ శాంతిని స్థాపిస్తాం అనడంతో నాటకం పూర్తవుతుంది. ఇదీ క్లుప్తంగా నాటకంలోని కథ.

ఏ నాటకంలో నైనా పదికాలాలపాటు ప్రేక్షకుడికి గుర్తుండిపోయేది. అందులోని సంభాషణలే. రాజకీయ నినాదాలతో నాటకాన్ని రక్తి కట్టిస్తాడన్న పేరు ఆత్రేయకు ఉంది. తరతరాల చరిత్రను తరచి చూసి వివేకవంతమైన ఆలోచనల్ని ప్రేక్షకుడిలో రగిలించాలన్నతపన ఆత్రేయలో కనిపిస్తుంది. అందువలన సాధ్యమైనంతవరకు అటువంటి సంభాషణల్ని నాటకంలో ప్రేక్షకుడికి సందేశం అవసరమైన చోట పెట్టడం ఆత్రేయ నాటక రచనలో అనుసరించే ప్రత్యేక శైలి. ఈనాటకంలోని కొన్ని సంభాషణలు మనల్ని అంతర్మథనంలోకి నెట్టేస్తాయి. యుగాల చరిత్రను తరచిచూసేలా చేస్తాయి.

•"భూదేవికెంతవయసో ముఖాన్ని బట్టి చెప్పలేం" (ఈ భూమి వయస్సును మనం లెక్క గట్టగలమా?)

•"యుద్ధం అంటే ఏంటి? యుద్ధం ఎందుకు వస్తుంది? దాని వల్ల ఏంటి లాభం?"

•"యుద్ధం గురించి నువ్వు నిజం రాయలేవు. రాస్తే మీ పంతులు మార్కులివ్వడు.

•యుద్ధాన్ని గురించి ఇంతవరకూ ఎవ్వరూ నిజం రాయలేదు.

•"యుగయుగాల నుంచి యుద్ధాన్ని చూస్తున్నది భూమే కాబట్టి యుద్ధాన్ని గురించి ఈ భూమాత కన్నా ఎవరూ వివరంగా విపులంగా చెప్పలేరు."

•"మనుషులందరూ ఒక్కటే అని అన్ని దేశాల్లో చూశాను. అందరూ మనలాగే నవ్వుతారు. ఏడుస్తారు. మనలాగే తింటారు. అందరికీ సుఖం దుఃఖం ఆకలి అన్నీ ఒక్కటే. అందరికీ ప్రాణాలంటే తీపి ఉంది. అందరికీ సుఖంగా బ్రతకాలని ఉంది. కూడు, గుడ్డ అందరికీ కావాలి. రంగులు తేడా, మాటలు తేడా, ఆచారాలు అలవాట్లు తేడా అంతే. అందరూ ఈ బతుకును హాయిగా చేసుకోవాలనే ప్రయత్నిస్తున్నారు."

•"శాంతి అనేది లోపల నుంచి రావలసిన ఒక మహత్తర యోగ ఫలం."

•"మరి ఆకలి మాత్రం లోపలి నుంచే కదూ వచ్చేది."

•"ఆకలి మనసులో కాదు కడుపులో ఉంటుంది"

•తిండి కోసం పశువు కూడా తాపత్రయ పడుతుంది. మరి మానవుని గొప్పతనం ఏంటి?

•"పశువు తన కడుపు నిండిన తర్వాతైనా ఇంకో పశువును తిననిస్తుంది. మానవుడు అదీ చేయడం లేదు. ఇంకొకడి ఆకలితో తన కడుపు నింపుకుంటున్నాడు."

•"మానవుడంటే జానెడు పొట్ట కాదు. మానవుడంటే రూపాయి బిళ్ళ కూడా కాదు."

•"భౌతికవాదం మానవుణ్ణి దురాశాపూరితున్ని చేస్తుంది. కర్మవాదం దోపిడీ వర్గానికి మంచి శ్రీరామరక్షలా మారింది."అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్టు ఏ సిద్ధాంతమైనా అతిగా మారితే అనర్థాలే వస్తాయని ఆత్రేయ హెచ్చరించారు.

"యుద్ధం ఒక విచిత్రమైన పుండు"అంటారు ఆత్రేయ. ఈ విచిత్రమైన పుండు ఎప్పుడు పుట్టిందో ఎక్కడ పుట్టిందో తెలియదు కానీ ఏ రోజైతే మానవునిలో స్వార్థం పుట్టిందో ఆ రోజే ఈ యుద్ధం అనే విచిత్రమైన పుండు కూడా పుట్టి ఉంటుంది. ఈ నాటకానికి ముందుమాట రాస్తూ శ్రీశ్రీ "జీవితానికి ప్రాణవాయువులాగా మానవజాతి సమిష్టి క్షేమానికి శాంతి అత్యవసరమని గుర్తించగలిగిన వాళ్లంతా తమ యావత్ శక్తులతో మోహరించి నిలిస్తే అసలు యుద్ధమనేదే లేకపోవచ్చు" అంటారు. మరి ఆది కాలం నుంచి మంచితనం మూర్తీభవించిన మానవులంతా యుద్ధం రాకూడదని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు కదా! అయినా యుద్ధం అనేది వస్తూనే ఉంది. యుద్ధం కూడా తన స్వరూపాన్ని మార్చుకుంటూ మనల్ని ఇంకా భయపెడుతూనే ఉంది. ఇద్దరు మనుషులు ఎదురెదురుగా నిలబడి యుద్ధం చేసే రోజుల నుంచి మనిషి ఇప్పుడు ఎన్నో లక్షల మైళ్ళ దూరం నుంచి కూడా లక్ష్యం ఛేదించగల అణ్వస్త్రాలను దాటి బయోవార్ల దాకా ఎదిగిపోయి ఉన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో విశ్వశాంతి కోసం ఆరాటపడడం విశ్వశాంతి కోసం పోరాటం చేయడం మనందరి కర్తవ్యం కూడా.

ఏ కథలో నైనా ఏ నాటకంలో నైనా కథావస్తువు అమరిక చాలా ముఖ్యం.

దీన్ని విమర్శకులు వస్తు శిల్పం అంటారు. అత్యున్నత నాటక శిల్పాన్ని ప్రదర్శించడంలో ఆత్రేయది అందె వేసిన చేయి. నాటక కథ ఎంత సంకీర్ణమైనదనా ఆద్యంతాల మధ్య ఒక సమన్వయం ఉండాలి. అది లేకపోతే  నాటకంలో ఒక వెలితి ఉంటుంది. విశ్వశాంతి నాటకంలో సమత ప్రవేశంతోనే ఆద్యంతాలు ఉంటాయి. "యుద్ధం! యుద్ధం! పాడు యుద్ధం" అంటూ సమత ప్రవేశించడంతో నాటకం ప్రారంభమౌతుంది. యుద్ధం ముగిసిపోవడంతో తెప్పరిల్లిన సమత లేచి కూర్చొని శాంతి కావాలని అందరూ అరవండి అనడం, అందరూ శాంతిని స్థాపిస్తాం! అనడంతో నాటకం ముగుస్తుంది. ఇది ఆద్యంతాల మధ్య కన్పించే సమన్వయం. ఒకే అమ్మాయిని ఒకరు సామ్రాజ్యం అని ఒకరు సమత అని పిలవడం ఈ నాటకంలో కనిపిస్తుంది. ఈ లోకంలో ఉన్నది ఒక్కటే. దాన్నే పలువురు పలు విధాలుగా భావిస్తున్నారు. మనం ఏ దృష్టితో ఆలోచించి ఏది సాధించాలనుకుంటే ఆ కోణంలోనే అన్నింటినీ చూస్తామనేటటువంటి భావన కలిగించడానికి కవి ఈ నాటకంలో ఇలాంటి ప్రయోగం చేశాడేమో! అని మనకన్పిస్తుంది. ఈ నాటకంలో ఉన్న మరొక కొత్త ప్రయోగం నాటకంలో అంతర్భాగంగా మరొక నాటకాన్ని ప్రదర్శించడం. ఆ నాటక ప్రదర్శన వల్ల ఈ నాటకంలో ఉన్న మనుషుల్లో పరివర్తన రావడం. ఇలాంటి పద్ధతి నాటకాల్లో కనిపించడం అరుదు. యుద్ధమనేది రంగస్థలం మీద ప్రదర్శించలేం కాబట్టి యుద్ధాన్ని చూపించకుండానే యుద్ధబీభత్సాన్ని రంగస్థలం మీద తెరవెనక నీడలతో ఎలా ఏవిధంగా ప్రదర్శించాలోకూడా ఈ నాటకంలో ఆత్రేయ వివరించారు.

ఈ నాటకం చదివాక మనకు కొన్ని భావాలు కలుగుతాయి. నిజంగా మనుషుల్లో అంత త్వరగా పరివర్తన వస్తుందా అని. యుద్ధం జరగబోయే ముందే యుద్ధానంతర పరిణామాలను అంచనా వేసి నిజంగా యుద్ధాన్ని ఆపుతారా అని. ఎందుకంటే చరిత్రలో ఒక అశోకుడు కావచ్చు ఒక అలెగ్జాండర్ కావచ్చు అందరికీ కూడా యుద్ధం తర్వాతే శాంతి కోసం ఆరాటం బయలుదేరింది. యుద్ధానికి ముందే శాంతి కోసం ఆరాటపడుంటే ఆ యుద్ధాలు ఆగి ఉండేవి కదా అని అనిపిస్తుంది కానీ వెంటనే అర్జునుడు గుర్తొస్తాడు. కురుక్షేత్రానికి ముందే యుద్ధ వినాశనాన్ని తలచుకొని యుద్ధం చేయనంటే కృష్ణుడు గీతోపదేశం చేశాడు. అంటే కచ్చితంగా ఎవ్వరూ యుద్ధానికి ముందు పూర్తి స్థాయిలో శాంతి సూత్రాన్ని ప్రవచించలేరని అర్థమౌవుతుంది. అందుకే యుద్ధాలు వస్తూనే ఉంటాయి. ఎందరెందరో బలి అవుతూనే ఉంటారు. కాబట్టి యుద్ధం ఉన్నంతకాలం ఈ విశ్వశాంతి నాటకం తెలుగు సాహిత్య రంగంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. మనిషిలో మార్పుకు కృషి చేస్తూనే ఉంటుంది.

******